# వదిలిన పిశాచం

-డా.దొన్నలగడ్డ మార్కండేయులు

**ఈ కథ పిల్లలకి ప్రత్యేకం**

వేదాంతపురములో వెంకయ్య, రాజేశ్వరి అనే దంపతులకు గోపన్న అనే కొడుకుండేవాడు. వాడు పదహారేళ్ల వయస్సు వచ్చినా కూడా ఇంటి పరిస్థితులను గమనించకుండా విపరీతమైన ఖర్చులతో ఆకతాయితనంగా తిరుగుతుండడంతో ఆ దంపతులు దిగులు పడసాగారు. రాజేశ్వరి ఒకనాడు "లేకలేక కలిగిన ఏకైక కొడుకని నేనే గారాబము చేసిన మాట వాస్తవం. ఇక నుంచి మీరైనా శ్రద్ధ పట్టి బాధ్యతలు తెలియజెప్పకపోతే లాభంలేదు. వాడికో దారి చూపించవలసిన బాధ్యత మనదేకదా"

"మనం సామాన్య సంసారులము. ఆ సంగతి వాడికి చెప్పి జల్సాగా తిరుగుతున్న వాడిని కట్టుదిట్టము చేయాలని నేనూ ప్రయత్నించాలనుకున్నానుగానీ ఒక్కడే సంతానమన్న ప్రేమ వాడిని అడ్డు పెట్టలేకపోయింది. ఇందులో నా తప్పు కూడా ఉంది. మొక్కై వంగనిది మ్రానయ్యాక వంగుతుందా? వాడిని భగవంతుడే మార్చాలి. మనమున్నంత కాలం వాడికే లోటూ రానివ్వకుండా చూద్దాము" అన్నాడు వెంకయ్య.

వాళ్ళు తరచూ ఈ విధంగా మాట్లాడుకునే వాళ్ళు. తల్లిదండ్రులు ఇలా దిగులు పడుతుండగా ఆ మాటలు ఒకసారి గోపన్న వినడం జరిగింది. వాడా మాటలు విని ఆలోచనలో పడ్డాడు. ఆలోచించి చూడగా వాడికి వారి బాధలో అర్ధముందనిపించి తాను మారాలనుకున్నాడు. ఆ సంగతి తల్లిదండ్రులకు చెప్పాడు.

"నాయనా! మనకు రెండెకరాల కొండ్ర ఉంది అది చాలు మనం సుఖంగా బ్రతకడానికి. కానీ నువ్వు మీ అమ్మమ్మగారి ఊరు కోటిపల్లికి వెళ్లి కొంతకాలం ఉండు. మీ తాత గోవిందు ఆ చుట్టుప్రక్కల గ్రామాలలో మంచి వైద్యుడు. చిన్నతనంలో నీ జాతక చూపించి నాతో చెప్పిన ప్రకారం నువ్వు వైద్య విద్యలో రాణించగలవని చెప్పాడు. ప్రయత్నించి చూడు. ఒక నాలుగేళ్లల్లో మీ తాత శిష్యరికములో నువ్వు వైద్య విద్యలో రాణించగలవని నీకు నమ్మకం తోస్తే సరే సరి. లేకపోతే మన పొలము మనకు ఉండనే వుంది" అన్నాడు.

గోపన్న సరేనని తాత గోవిందు ఇంటికి వచ్చాడు. మనవడిని చూసి తాత, అమ్మమ్మ చాలా సంబరపడిపోయారు. వాడెందుకు వచ్చాడో చెప్పిన తరువాత తాత గోవిందు-

"ఒరే గోపన్న! చదువుకోవలసిన వయసులో నువ్వు అశ్రద్ధ చేసావు. ఇప్పుడైనా మించిపోలేదు. వైద్యవిద్య నీకు నేర్పుతాను. వైద్య విద్యకు అభిలాష ఒక్కటే సరిపోదు. సేవాభావం కూడా ఉండాలి. అపాత్రుడికి దానం చేస్తే పిశాచమై తిరగాల్సి వస్తుంది. కోటిపల్లి గోదావరి రేవులో రంగాచారి అనే వైద్యుడు అనర్హుడికి విద్య ధారపోసినందుకు పిశాచమయ్యాడు. నేను కోటిపల్లి రేవు దగ్గర జరిగే సంతలో ఎప్పుడు మూలికలు కొనడానికి వెళ్లినా నాకేకాదు, వైద్యుడయిన ప్రతివాడ్నీ కూడా రంగాచారి వైద్యుడి రూపంలో కనబడి భయపెడుతున్నాడు. చింతామణి అనే మందు తయారుచేసే విధానముంది. ఆ మందు ప్రయోగిస్తే మరణశయ్యమీద ఉన్న మాట్లాడలేని రోగిని కూడా మాట్లాడింపజేయవచ్చు. అయితే నలుగురికి ఉపయోగపడే రహస్యమేదైనా తెలుసుకోవాలనుకున్నప్పుడు మాత్రమే ఆ మందు చనిపోవడానికి సిద్ధంగా ఉన్న రోగిపై ఉపయోగించాలి. రంగాచారి శిష్యుడొకడు వశీకరణ మంత్రం తెలిసిన చావు బ్రతుకులలో ఉన్న ఒక సన్యాసిమీద ఆ మందు ప్రయోగించి బ్రతికించి వశీకరణ మంత్రం నేర్పమని అడిగాడు. ఆ సన్యాసి మంత్రం నేర్పలేదు సరికదా మరణంతో సిద్ధి పొందాలనుకున్న తనను స్వార్థంతో బ్రతికించినందుకు మండిపడ్డాడు. రంగాచారిని, అతని శిష్యులను పిశాచాలు కమ్మని శపించాడు. నిస్వార్థంగా చింతామణి వైద్య విద్య నేర్చుకున్న వాళ్ల శాపాలను తొలగించగలుగుతాడుట. మీ దగ్గర వైద్యం నేర్చుకునే మీ శిష్యులను మేము గమనిస్తున్నాము. అందరూ డబ్బుకోసమే వైద్యం నేర్చుకుంటున్నారు. స్వార్థంతో చింతామణి వైద్యవిద్య ప్రయోగించి లాభపడాలని చూస్తే వాళ్లను బ్రతకనీయము అని రంగాచారి వైద్యులను బెదిరిస్తున్నాడు. నువ్వు పెరిగిన మనస్తత్వాన్నిబట్టి నేర్చిన వైద్యవిద్యను స్వార్థానికి ఉపయోగించకుండా ఉండలేకపోవచ్చు. నేను శిష్యునిగా భావించి వారసుడిగా వైద్యవిద్య నేర్పి చింతామణి మందు తయారీ నేర్పడం మానేసినా మరో వైద్యుడి దగ్గర నేర్చుకుని ఎప్పుడేనా ప్రయోగించే అవసరం నీకు కలిగితే స్వార్థపరుడవని రంగాచారి పిశాచం భావిస్తే నీ ప్రాణానికి ముప్పు వుంది. నేను కూడా నిన్ను శిష్యునిగా చూడలేను. కూతురు బిడ్డవని గుర్తుకురాగానే నేను నీకు ఆప్యాయత చూపగలనే తప్ప బాధ్యతాయుతంగా చదువు చెప్పలేను. నీకు చదువు రావాలంటే తగిన గురువును నేను కాలేను. నేను వైద్యము నేర్చుకున్నది కఠిన పరిశ్రమతో క్రమశిక్షణ కలిగిన గురువువద్ద. నేను గురువులా నీకు క్రమశిక్షణ నేర్పి బాధ్యత తీసుకోవడానికి ప్రేమపాశం అడ్డు తగులుతుందని భయంగా ఉంది. నువ్వు కొంతకాలం నా వైద్య విధానాన్ని పరిశీలించు. ఆసక్తి ఉంటే తగిన గురువువద్ద నిన్ను ప్రవేశపెడతాను. ఏమంటావు?" అన్నాడు.

"తాతయ్యా! నేనెలాగైనా ప్రయోజకుడ్ని కావాలి. అందుకు నువ్వు ఏం చెప్పినా చేస్తాను సరేనా?" అన్నాడు. నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి. వాడు తన ఇంటికి, అమ్మమ్మ ఇంటికి మధ్య తిరుగుతూ ఇరవై ఏళ్ళ వయసువాడయ్యాడు. ఏవో మూలికలు ఇచ్చి నూరించడం, చిన్న చిన్న మందులు పేర్లు చెప్పి వచ్చినవాళ్లకు ఇమ్మని పురమాయించడం తప్ప వాడికి నాడి కూడా చూడడం రాలేదని అమ్మమ్మ గ్రహించింది.

ఒకరోజు పక్క గదిలో వాడు నిద్రపోయాడనుకుని ఆమె గోవిందుతో "అసలుకన్నా వడ్డీ ముద్దంటారు కదా. అలాంటిది సొంత మనవడి విషయంలో మీరు ఎందుకు శ్రద్ధ చూపడంలేదో నా ఊహకు అందడంలేదు. పిశాచం భయంతో వాడు ఈ వృత్తికి పనికిరాడని మీకనిపిస్తే నిష్కర్షగా చెప్పి వాడిని వాడి తండ్రివద్దకు పంపించేయడం మంచిది. వాడికి పెళ్లి వయస్సు కూడా వచ్చింది. ఏదో బాధ్యత వాడికి అప్పగించే పని మన అల్లుడే చూసుకుంటాడు. వాడిని రెండికి చెడ్డ రేవడిని చేయకండి" అంది.

"నేను వైద్య విద్య నేర్పలేనని వాడికి నిష్కర్షగా చెప్పలేను. వాడే తెలుసుకోవాలని కోరుకుంటున్నాను. వైద్యుడిగా మారిన తరువాత స్వార్థపరుడని రంగాచారి పిశాచం భావిస్తే వాడి ప్రాణానికి ముప్పు వుంది" అన్నాడు గోవిందు.


గోవిందు భార్య భయంతో "వాడికి మీరు వైద్యం మరెవరిదగ్గరా కూడా వాడిని శిష్యునిగా కూడా చేర్పించవద్దు. మరో మార్గం ఆలోచించి వాడు సుఖంగా బ్రతికే ఏర్పాటు చేయలేకపోలేము. మీరు కూడా ఈ వృత్తి మానేయండి. దెయ్యాలతో మనకు చెలగాటమొద్దు" అంది.

గోపన్న, తాత తనకు వైద్యం నేర్చుకునే విషయంలో ఆసక్తి చూపడని గ్రహించి దిగులుతో ఎప్పటికోగానీ నిద్ర పోలేకపోయాడు.

★★★

మరునాడు నిద్ర లేచాక గోపన్న "తాతా! రాత్రి మీ మాటలు విన్నాను. ఇక నేను మా ఊరు వెళ్లిపోతాను. మా నాన్న చెప్పినట్లు వింటూ పొలం పని నేర్చుకుంటాను. ఆశీర్వదించు. జీవితంలో ఏ పనిచేసినా ఏదో ఒక సమయంలో స్వార్దంగా వ్యవహరించక తప్పదు. అటువంటప్పుడు ప్రాణాలతో ముడివడిన వైద్య వృత్తిలో భయానికి లోనై అత్యవసర పరిస్థితులలో రోగికి వైద్యం చేయలేని పరిస్థితి రాకూడదు. ఏది స్వార్థము, ఏది స్వార్థముకాదు అని నిర్ణయించే అధికారం పిశాచం చేస్తుందని భయపడుతున్న నీ దగ్గర వైద్యం నేర్చుకోవడం నాకిష్టంలేదు'' అన్నాడు.

"నేను ముందే చెప్పాను. నువ్వు నా మనవడివి. చింతామణి మందు తయారీ నేర్చుకోనివాడు వైద్యుడే కాదు. నా వారసుడివి. నన్ను గురువుగా భావించి నువ్వు విద్య నేర్చుకుంటే పిశాచం జీవితమంతా నిన్ను గమనిస్తూ ఒకవేళ నువ్వు నిస్వార్థంగా ఉన్నా నీవల్ల తనకు మోక్షం కలిగే ఉపాయం సాధించుకోవాలని చూస్తుంది. చింతామణి నేర్పిన తక్షణం నన్ను చంపేస్తుంది. మనిద్దరి ప్రాణానికి అశాంతి కలిగించే ఈ వృత్తి నీకు మనస్ఫూర్తిగా నేర్పలేక సతమతమవుతున్నాను. నువ్వెక్కడ ఉన్నా నీకు నా ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి'' అన్నాడు. ఒక మంచిరోజు చూసి తాత అమ్మమ్మల దగ్గర సెలవు తీసుకుని గోవన్న సొంత ఊరైన వేదాంతపురంలో శాశ్వతంగా ఉండిపోవడానికి బయలుదేరాడు. వెళ్లిపోయేముందు ఒకసారి.వాడికి కోటిపల్లిరేవుకు వెళ్లి రంగాచారి పిశాచాన్ని కనిపెట్టి చూడాలనిపించింది. ఆ విషయం తాతకు చెప్పలేదు. వాడు కోటిపల్లి రేవుకు వచ్చాడు. ఆ రోజు అక్కడ సంత జరుగుతోంది. రకరకాల దుకాణాలు చూసుకుంటూ నడుస్తున్నాడు. ఆ సందడికన్నా ఒక ప్రదేశం గోవన్నను బాగా ఆకర్షించింది. అక్కడ గుర్రబ్బగ్గీల అమ్మకం జోరుగా సాగుతోంది. సామాన్యుడి మొదలు ధనవంతుడి వరకు ఎవరి తాహతునుబట్టి వాళ్ళు బగ్గీలు కొనుగోలు చేస్తున్నారు. ధనవంతులు, కొందరు సామాన్యులు అవి కొనడం హోదాగా భావిస్తారు. గుర్రబ్బగ్గీని ప్రయాణ సాధనంగా నడిపి పొట్ట పోషించుకునేవారు కూడా వాటిని కొనడానికి వస్తారు. అందుచేత అక్కడ సందడితోపాటు రకరకాల బగ్గీలు, గుర్రాలు కనువిందు చేస్తున్నాయి. ఆ సందడిలో దిగులుగా కూర్చున్న ఒకమ్మాయి గోవన్నను ఆకర్షించింది. ఆ అమ్మాయికి పదహారేళ్లుంటాయి. ఆమె పేరు రాధ. ఓ పాత గుర్రబ్బగ్గీని అమ్మకానికి తెచ్చింది. పాత బండైనా నగిషీతనంతో ఆ బండి ఆకర్షణీయంగా ఉంది. అందుచేత దానిని కొందామని ఎవరేనా ముందుకు వచ్చినా కొత్త బండి ధర కన్నా ఎక్కువ ధర చెప్పడంతో వారంతా రాధను అపహాస్యం చేసి వెళ్లిపోసాగారు. పైగా బండిలో ఒక రోగిష్టి ముసలివాడున్నాడు. రాధది బ్రతికి చెడ్డ కుటుంబం. బండిలోని రోగిష్టి ముసలివాడు ఆమె తాత. వ్యాపారాలెన్నో చేసి చాలా ధనం సంపాదించాడు. అయితే ఆ వర్తకుడు ఎవరినీ నమ్మేవాడుకాదు. సంపాదించిన సొమ్మును ఎవరికీ తెలియనిచోట దాచాడు. వశీకరణ మంత్రం నేర్చుకోవడానికని ఒక సన్యాసిని చేరదీసాడు. ఆ సన్యాసి ఒకరోజు సమాధిలో అపస్మారక స్థితిలో ఉండగా ఒక వైద్యుడిని తీసుకువచ్చి ఏదో మందు వేయించాడు. సన్యాసి తెలివిలోకి



వచ్చి ఏం శాపమిచ్చాడో తెలియదుగానీ అప్పటినుండి మాట మంతీ పడిపోయి రోగిష్టివాడిలా, ఏమీ గుర్తులేనివాడిలా అయిపోయాడు. ముసలివాడికి ఇద్దరు మగపిల్లలు. తండ్రిపోయాక ఉన్నదే ఇద్దరూ పంచుకుని విడిపోయి తండ్రిని వంతులు వేసుకుని పోషిస్తున్నారు.

ఎప్పటికేనా తండ్రి మామూలు మనిషై దాచిన సంపద గురించి చెప్పగలిగితే తమ దశ తిరుగుతుందని వాళ్ల ఆశ. ఉన్నంతలో గుట్టుగా బ్రతుకుతూ ముసలివాడి వైద్యానికి ఖర్చు పెట్టడానికి వెనుకాడకపోవడంతో బాగా ఇబ్బంది పడుతున్నారు. రాధ పెద్దవాడి కూతురు. ఇప్పుడు వంతు రాధా వాళ్ల నాన్నది. ఆ బండి కూడా ముసలివాడిదే. ఆ బండిలో కూర్చునే ఎక్కడికైనా వెడుతుంటారు. అలా బండిలో త్రిప్పితేనన్నా మామూలు మనిషి అవుతాడని రాధ ప్రతీ సంతకూ వస్తోంది. ఆమెకు బండి అమ్మే ఉద్దేశ్యంలేదు. కానీ పాత బండిని మోజుపడి కొనేవాళ్లుంటే, మంచి ధర వస్తే అమ్మడానికి సిద్ధంగా ఉంది. రాధను పలకరించి గోపన్న ఈ సంగతులు తెలుసుకుని చింతామణి మందు తెలిసిన రంగాచారి శిష్యుడే ఈ వర్తక ముసలివాడు అయి ఉంటాడని ఊహించాడు. ఈ ముసలివాడు రంగాచారి ద్వారా చింతామణి ప్రయోగించి శాపానికి గురయ్యాడు. రంగాచారి పిచాశమయ్యాడు.

ఇదే నిజమైతే తను వైద్యుడు కాదు కాబట్టి రంగాచారి పిశాచం కనబడదు. ఈ అమ్మాయిని తాత గోవిందు దగ్గరకు తీసుకువెళ్లి చింతామణి వైద్యం చేయిస్తే పిశాచం తప్పక కనిపిస్తుంది. ఒకవేళ ఈ కథ అబద్ధమైతే దాన్ని బ్రతిమాలైనా రాధ తాతను బాగు చేయించాలి. అందువల్ల తనకు స్వార్థముందని పిశాచం ఆరోపించలేదు. ఇలా ఆలోచించ గోపన్న రాధకు తానెవ్వరైందీ చెప్పి బండిలో తన తాత ఇంటికి వెళదాం రమ్మన్నాడు. ముందు తటపటాయించినా గుర్రబ్బగ్గీ తోలే నౌకరు ఉన్నాడనే ధైర్యంతో రాధ గోపన్నతో కలసి గోవిందు ఇంటికి వచ్చింది.

గోవిందు పిశాచభయంతో తెలియదన్నాడు. కానీ గోపన్న పట్టుదల చూసి "పిశాచ భయంతో ఎవరూ ఇప్పుడు ఈ మందు తయారుగా ఉంచడంలేదు. ఈ మందు తయారీకి కొన్ని దినుసులు కావాలి. రాధని, ఆ అమ్మాయి తాతని ఇక్కడ వదిలి మళ్లీ బండిలో సంతకు వెళ్లి కొండ మిరియాలు, గంధకం, తిప్పతీగ, పాదరసం కొనుక్కునిరా. వాటితో చింతామణి తయారు చేస్తాను. నిన్ను పిశాచం అడ్డుకుంటే నేనేమీ చేయలేను" అన్నాడు.

గోపన్న బండిలో సంతకు వెళ్లి తాత చెప్పిన దినుసులు తీసుకుని తిరిగి వస్తున్నాడు. రంగాచారి పిశాచం వైద్యుడి వేషంలో అడ్డగించి "చింతామణి మందు తయారుచేస్తే మీ తాతను చంపేస్తాను" అన్నాడు.

గోపన్న నవ్వి "నీ కథంతా నాకు తెలుసు. నీకసలు శిష్యుడే లేడని నేననుకుంటున్నాను. నువ్వే వశీకరణ మంత్రం నేర్చుకుని రోగులను ఆకట్టుకుని డబ్బు గుంజాలనే ఆశతో ధనికుడైన రాధ తాతను ప్రేరేపించి సన్యాసిని, ఆయన యోగ సమాధిలో ఉండగా అపస్మారక స్థితిగా భావించి చింతామణి ప్రయోగించి లాభపడాలని అనుకున్నావు. కానీ అనుకోకుండా సన్యాసికి యోగభంగం అవడంతో నీ కోరిక ఫలించలేదు. నువ్వు పిశాచమయ్యావు. రాధ తాత అయిన ఈ వర్తకుడు రోగిష్టివాడయ్యాడు. పిశాచానివై వైద్యానికి అడ్డు పడుతున్నావు. ఇప్పుడు నేను మా తాత చేత వైద్యం చేయించదలిచాను. నాకుగానీ మా తాతకుగానీ స్వార్థముందని నువ్వు అనలేవు. నీకింకా డబ్బు మీద ఆశ పోలేదు. రాధ తాతను నువ్వు పట్టుకుని పీడిస్తూ అతని డబ్బును వారసులు అనుభవించకుండా చచ్చి పిశాచమై కాపలా కాస్తున్నావు తప్ప నిన్ను సన్యాసి శపించలేదు. ఇప్పటికైనా రాధ తాతను విడిచి వెళ్ళు. వాళ్ళ కుటుంబానికి సౌఖ్యం కలగనీ. చింతామణి ప్రయోగిస్తే నీ కథ రాధ తాత ద్వారా అందరికీ తెలిసిపోతుందని నువ్వు వైద్యులను బెదిరిస్తున్నావు. అందుచేత నీది దుష్టబుద్ధి అని నేను కనిపెట్టగలిగాను. ఇదే నిజమని నేను నిరూపించబోతున్నాను. కాబట్టి నాకు స్వార్థబుద్ధి ఉందని నువ్వు అనలేవు. ప్రజోపకారకమైన మందును నీ నుంచి రక్షించదలచిన నాకు నీ పిశాచ రూపం అడ్డుపడలేదు. తొలగిపో" అన్నాడు.

పిశాచం నవ్వి "స్వార్థమే పిశాచ రూపంలో సంచరిస్తుందనడానికి నేనే ఉదాహరణ. ధనదాహంతో ఆరోగ్యవంతులను కూడా రోగాలపాలు చేసేవారికి నా కథ కనువిప్పు అవుతుంది. నీ నిస్వార్థానికి తల వంచుతున్నాను" అంటూ మాయమైపోయాడు. రాధ తాతకు చింతామణితో అవసరం లేకుండా మాట తిరిగి వచ్చింది. గోపన్న ఊహించిన విధంగానే జరిగిందని చెప్పి రాధ తాత "అడ్డదారిలో సొమ్ము సంపాదించడానికి వశీకరణ శక్తి సంపాదించాలన్న కోర్కెలే మనిషిని పిశాచిగా మారుస్తాయి. నాలాంటి వాళ్ళు ఇలా పిశాచి బారిన పడతారు. నీలాంటి యువకులు చక్కగా పరిస్థితులను అధ్యయనం చేసిననాడు పిశాచిలాంటి దుష్టశక్తులను అదుపులో పెడతారు" అన్నాడు.

ఆ తరువాత గోపన్న తాత గోవిందు దగ్గరే వైద్యం నేర్చుకుని పేరు తెచ్చుకున్నాడు. రాధను పెళ్లి చేసుకుని సుఖంగా జీవించి తల్లికి తండ్రికి ఆనందం కలిగించాడు.

★

## ఇవి పాటించండి



ఆధునికత బాగా పెరిగిపోయిన ఈరోజుల్లో అనారోగ్యాలు కూడా బాగా వృద్ధి చెందుతున్నాయి. అందుకే ప్రాచీన జీవనశైలిని అంతా అలవర్చుకుంటున్నారు. 'యోగ శిక్షణ పొందడం ద్వారా ఎన్నో ఆరోగ్యసమస్యల నించి విముక్తి పొందవచ్చు' అంటోంది అనుష్క. సూపర్ చిత్రంతో టాలీవుడ్‌లోకి ప్రవేశించిన ఈభామ ఇప్పుడు మహానందిలో కూడా నటించింది. 'నేనెప్పుడూ భారీ హంగామాకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వను. సింపుల్‌గా ఉండే జీవన పద్ధతులంటే నాకెంతో ఇష్టం. వాటినే ఆచరించమని నా అభిమానులకి, మిత్రులకి కూడా చెబుతాను' అంటోంది. మొత్తానికి ఈ 'సూపర్' భామ సూపర్ సలహా ఇచ్చిందన్నమాట.

